స్కెచ్

# గడ్డిపరకలు

ఆర్. యం. చిదంబరం

చరచర చీకటి పాకిపోతోంది. ఆకాశములో కమ్ముకున్న మేఘాలు మిగిలిన కాస్త చీకటిని కూడా మింగేశాయి.

మూల వొదిగిపడుకున్న నల్లకుక్క మెల్లిగా మూలిగింది. ఇంకా దగ్గరగా ముడుచుకుని పడుకుంది. రావయ్య వందోసారి నిట్టూర్చాడు. గోడకొదిగి పడుకున్న వాడల్లా ఓసారి తలెత్తి బయటి వాతావరణంలోకి చూశాడు- భయానకంగా వుంది.

నల్లకుక్క మళ్ళీ జాలిగా బాధగా మూలిగింది. "చలేస్తోంది గామోలు దానికి... మనకే దిక్కు లేకుండా వుంటే దాన్నెవరు చూస్తారు? ఇలా సావల్సిందే!" అని తన కాశ్రయమిచ్చిన గోడమీదే తుబుక్కున వుమ్మేశాడు. భూతాలూ దెయ్యాలూ వున్నాయని భయపడి పారిపోయి ఆ యింటిని నిర్మానుష్యంగా వదిలేశారు. భూతాన్నె మింగ గలిగిన రావయ్యకది నిలయమైంది. అతనితో పాటు అతనికిమల్లే అతీగతీ లేని ఆ నల్ల కుక్కొకటి.

"దానికున్నంత ఇశ్వాసం ఎవరికుంటుంది?" అనుకుని రావయ్య గూట్లో అగ్గిపెట్టె కోసం వెతుకుతున్నాడు. ఏ వాడో అర్ధణా పెట్టి కొనుక్కొచ్చిన అగ్గిపెట్టి- అదేం చిత్రమో కాని దాన్నింత వరకూ ఎవడూ ఎత్తుకుపోలేదు. మెరుపు మెరవటంతో అదీ కనిపించింది. గోడమూల వుంచిన చుట్టపీలిక అంటించాడు. నల్లకుక్కకేసి చూశాడు రావయ్య. పొట్టిందకీ పైకి ఆడుతోంది. బతికే వుందనుకున్నాడు.

* • *

ఆవేళ పొద్దున్న తను బయలుదేరేసరికి ఒంటి బ్రాహ్మడు ఎదురుగా వస్తున్నాడు... ఛీ... తనకేవిటి శకునాలు? చరచర వెళ్లిపోయాడు. తను బయలుదేరి కొంతదూరం వెళ్ళాక నల్లకుక్క కూడా లేచి బరువుగా తోకాడించుకుంటూ ఆహారంకోసం వెళ్లిపోయింది. ఇంకా పాడుపడ్డ ఇల్లు చిన్నబోతుందిగామోలు!

దూరంగా చెట్టు కనిపిస్తోంది. ఎందుకో అది ఏనాడూ చిగర్చదు, తన బతుకులాగే వుంది దానిది కూడా. పనికిరానిదాన్ని ఎందుకుంచారో మునిసిపాలిటీ వాళ్ళు, "నాకోసం" అనుకుని అసహ్యంగా నవ్వాడు. తనలాగే మరో నలుగురు అడుక్కునే ఆఫీసుకుపోయే ఉద్యోగస్తుల్లా పరుగెడుతున్నారు.

అతను చెట్టుక్రింద కూర్చున్నాడు. మూటలోంచి గోనిసంచీతీసి నేలమీద పరిచాడు.

మామూలుగా రాగయుక్తంగా అడుక్కోటం మొదలెట్టాడు. తనముందునుంచి ఎన్నో బుష్ కోట్లు, జార్జెట్ చీరెలు వెళ్ళాయి. కాని ఒక్కటి కూడా మంచుబిందువును వర్షించలేదు.

ఎనిమిదైందికాని కనీసం చిల్లికానైనా గోనె గుడ్డమీద పడలేదు. రావయ్యకెదురుగావున్న కుళాయి "ఫరవాలేదు- నేనున్నానుగా" అంటోంది. అతను యధారీతిగా తనని కన్నవాళ్ళని నానా బూతులూ తిట్టాడు. "ఇక్కడకూడా అప్పులూ.. కార్లూంగట్రా నావు..."

రామయ్య గుభుక్కున కుడిపక్కకు తిరిగి చూశాడు. ఎవడో తనలాంటివాడు ఓ పిల్లను నాలుగు గజాలదూరంలో కూచోబెడుతున్నాడు.

"దానికి కళ్ళులేవుగాబోలు .. నాదగ్గరే కూకోవాలా?... దీనక్కడా పోటీ" విసుక్కున్నాడు.

"మర్నేను మజ్జాన్నమొత్తాను .. జాగ్రత" అనేసి అతడు అణువంతై జనప్రవాహంలో కలిసిపోయాడు. ఆ పిల్ల ఏదో పాడుతూ అడుక్కోటం మొదలెట్టింది. రావయ్య పళ్ళుకొరికాడు.

తను బాధగా-జాలిగా అడుక్కుంటున్నాడు. పన్నెండైంది.

తన గోనిమీద వేడుంది - నాలుగు చిల్లు కానులూ- రెండర్ధణాలూ.

చూడకూడదనుకుంటూ అటు కేసి తిరిగి చూశాడు. ఆ పిల్ల గలగలమంటూ డబ్బులు లెక్కపెట్టుకుంటూ 'రూపాయి' అనుకొంది...

రావయ్య కుళాయిదగ్గర కెళ్లొచ్చాడు.

ఒంటి గంటైనా ఎవరూ రాలేదు. ఆ పిల్ల అరవటం మానేసి గోనెమీద కాళ్ళూ చేతులు ముడుచుకుని పడుకుంది.

"కొంపతీసి సావలేదు కందా!" అనుకున్నాడు. రావయ్య.

మరుక్షణం అనుకున్నాడు: "ఆకలేత్తోంది గామోలు!...మజ్జాన్న మెుత్తానన్న ఎదవ రానే లేదు..." మరో అరగంట చూశాడు. ఆ అమ్మాయలాగే సద్దులేకుండా పడుకుంది. మెల్లిగా ఆడపిల్లదగ్గర కెళ్ళాడు.

"ఆకలేత్తోందా? అందుకా తొంగున్నావు?"

బయటవున్న రామణీయక ప్రపంచాన్ని చూడనీయకుండా అడ్డుపడుతున్న చీకటి తెరను చీల్చటానికి యత్నిస్తున్నట్టుగా అటూయిటూ చూస్తూ "అవునండి...ఎవరు బాబూ...అంత జాలిపడి అడుగుతున్నారు?... దరమాత్ములు" అంది లేచి కూర్చుని.

"ఆఁ ఏం దరమాత్ముల్లే! నీకొ్కంతదూరంలో వుండి అరుత్తున్నోణ్ణి నేనే. ఇంతకీ మజ్జాన్న మెుత్తానన్న తను నీకేమవుతాడు బుల్లీ!"

"ఆడా...ఆడా...ఆడుమా అన్న" అంది.

"ఒత్తానన్నోడు రానేదే?"

"ఎక్కడకుపోయాడో సచ్చినోడు. నాపాలిటి యెమదమ్మరాజు."

రావయ్య కొంతసేపు మౌనంగా వుండిపోయాడు. ఆ పిల్లకు కళ్లులేవని మొదట్లో అతను నమ్మలేదు. కళ్లులేని కబోదులమని అడుక్కునే వాళ్ళలో కొంతమంది కడుపుకట్టుకుని, కక్కుర్తి పడి సినిమాలకుపోవటం తనకు బాగా తెలుసు, కాని దగ్గరకొచ్చిచూశాక ఆమెకు నిజంగా కళ్లు లేవని నిశ్చయించుకున్నాడు.

"ఐతే మరి నే నేదన్నా తెచ్చిపెట్టేదా?" తలూపుతూ గోనదుగునున్న డబ్బులు తీయబోయింది.

"అక్కర్లేదులే" అని రావయ్య నిన్నటిదీ ఇవేళటిదీ కలిపి తన దగ్గరున్న పావలాతో ఏదో కొని తెచ్చాడు.

"నీకు వెయ్యిదండాలు బాబూ!...నువ్వు సల్లగా వుండాలి. ఏదో కళ్లులేని ముండను"

"నువ్వు తొరగా చావాలి" అంటే బాగుండు ననుకున్నాడు రావయ్య. ఆమెకోసం పావలా వెచ్చించినందుకు ఆకలి తీర్చినందుకు రావయ్యకు కొండెక్కినట్టుంది. ఇచ్చేవాడి హృదయం ఎలా పరవళ్ళుతొక్కుతుందో తనకు తెలియదు. ఇదే మొదటిసారి ఆ సాయంత్రం ఆ పిల్ల అన్న వచ్చాడు.

"అన్నా!...మజ్జాన్నం రాలేదేవిరా? ఆకల్తో సత్తాననుకున్నావా?......అయనెవడో తెచ్చి పెట్టాడు కాని..."

"సొమ్మంతా తగనేశావూ?... నే నెక్కడో సచ్చాను ఎదవబాధ... నిన్ను తీసుకురావటం-తీసుకెళ్ళటం. నా ఎదవ బతుక్కి నవోతవు సచ్చినా బాగుండును" అన్నాడతను. రావయ్యకు శూలంతో పొడిచినట్టయింది.

కోతిచేతికి పూలదండిస్తే ఏమవుతుంది? "ఆబ్బాయి!...దాన్నలా కసురుకుంటా వెందుకు? దానికేం తెలుత్తుంది-గుడ్డిముండ..సచ్చేటప్పుడు సత్తుందిలే - అదేం కర్చుపెట్టనేదు..ఏమీ అన వోక" అన్న రావయ్యకేసతను కోపంగా చూశాడు-వాళ్లిద్దరూ వెళ్లిపోయేదాకా రావయ్య చూస్తూనే వున్నాడు.

* * *

వర్షం బాగా దంచుతోంది. ఆరిపోయిన చుట్టను సురక్షితంగా గోడమూలకు చేర్చాడు రావయ్య. ఆ పిల్ల అస్తమానం కనిపిస్తోంది. ఎక్కడన్నా వాళ్ళన్న వదిలేసిపోతే దానిగతేమవుతుంది? గుడ్డిది .. ఎవడాదరిస్తాడు?.. అందరూ తనలాంటివాళ్ళే వుంటారా? మళ్ళీకనిపిస్తుందో కనిపించదో!.. పావలా ఆ పిల్లకోసం వెచ్చించినందుకు తనకానందం!...

తెల్లారేసరికి వర్షం బాగా తగ్గిపోయింది. రావయ్య గోడమూలకేసి చూశాడు. నల్లకుక్క మూలగటంలేదు. దానిపొట్ట కిందికీ పైకీ ఆడటం లేదు. కంగారుపడి దగ్గరకెళ్ళి చూశాడు. నల్లకుక్క చచ్చిపోయింది!

రావయ్య కెందుకో కళ్ళంట నీళ్లు తిరిగాయి. నిన్నటి పిల్ల జ్ఞప్తికిరాగానే 'దానికీ దీనికీ తేడా యేంటి?' అనుకున్నాడు. చుర్రున ఆకలి పొడిచింది. చర్రున కదిలాడు.